క్లుప్తంగా

టీ షర్టుల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేద వర్గాలకు తనవంతుగా తోడ్పాటు అందిస్తూ నగర వాసి ఉదయ భాస్కర్ గురువారం టీ షర్టులు, ఫ్యాంట్లు పంపిణీ చేశారు. నగరానికి చెందిన వ్యాపారి నరేష్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ భాస్కర్ మాట్లాడుతూ తాము నిర్వహిస్తున్న కార్యక్రమాలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ సహకారంతో ముద్రించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ పోస్టర్లను గురువారం కడప డీపీఓ కార్యాలయంలో జిల్లా పరిషత్ అధికారి రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఒంటిమిట్ట గ్రామ పంచాయతీలో ఇంటింటికి చెత్త సేకరణలో భాగంగా తడిచెత్త, పొడిచెత్త సేకరణలో భాగంగా తడిపొడి చెత్తను వేరుచేయు విధానంపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ పోస్టర్లను ముద్రించారు. అలాగే స్థానిక పీహెచ్‌సీ గోడలపై స్లోగన్స్‌ను కూడా రాయించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ పరిపాలనాధికారి ఖాదర్ బాషా, ఒంటిమిట్ట ఈఓపీఆర్‌డీ కెఆర్‌ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక అధికారి

కడప రూరల్ : కడప నగరం ఫక్కీరుపల్లె పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం కడప సహాయ జిల్లా అగ్ని మాపక అధికారి బసిరెడ్డి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఫైర్ ఎక్స్టింగ్ విషర్‌ని ఎలా ఉపయోగించాలి, వంట గ్యాస్ ఎల్‌పీజీ పైన డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్‌రెడ్డి, డాక్టర్ హైమావతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చెస్‌లో ప్రతిభ



జాతీయస్థాయి చెస్ పోటీలో సత్తా చాటిన లాస్యశ్రీని అభినందిస్తున్న హెచ్‌ఎం

కడప ఎడ్యుకేషన్: కడప మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.లాస్య శ్రీ అనే విద్యార్థిని స్కూల్ గేమ్స్ చెస్ జాతీయస్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్. ఆశ్రిఫన్ తెలిపారు. ఇటీవల మహారాష్ట్ర నారదవాడ జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ చెస్ అండర్ 17 క్యాటగిరి జాతీయ స్థాయి పోటీలో పాల్గొని మెడల్ సాధించిందన్నారు. లాస్యశ్రీ చదువుతోపాటు ఆటలలో కూడా ముందుండి జిల్లా, రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభచాటడం మాకు చాలా ఆనందంగా ఉందన్నారు. గురువారం లాస్యను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు, పీఈటీ ప్రసాద్, రమేష్ అభినందించారు.

వాహనాల తనిఖీ



కడప నగరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది

కడప అర్బన్ : విజిబుల్ పోలీసింగ్ ను మరింత బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు కడప జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసు అధికారులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్ల డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

కడపఅర్బన్ : కడప నగరం తారకరామా నగర్ లో రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన శేఖర్ రెడ్డి కొంతమంది దగ్గర నుండి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి 800 కిలోల స్టోర్ చేసుకుని వాటిని వాహనంలో తరలించేందుకు సిద్ధంగా ఉండడంతో అతడిని అరెస్టు చేశామన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎండిన చెరువు... ఆందోళనలో రైతులు






కమలాపురం నియోజకవర్గం పరిధిలోని చింతకొమ్మదిన్నె చెరువు నీరు లేక బోసిపోయింది. దీంతో చెరువు ఆయకట్టు రైతులు ఆందోళనలో ఉన్నారు. చెరువులో నీరుంటే పంటల సాగుకు.. పొలాలలో భూగర్భ జలాలకు అనుకూలంగా ఉంటుందని.. నీరు లేకపోతే పంటల సాగు కష్టమేనని వేదన చెందుతున్నారు. రోజు రోజుకు ఎండలు పెరుగుతున్న క్రమంలో ఉన్న నీరు కూడా తగ్గిపోతుందని అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. జిల్లాలోని చాలా చెరువులు ఇలాగే నీరు లేక వెలవెలబోతున్నాయని రైతులు అంటున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

● నిద్రిస్తున్న నిఘా!



కడప నగరంలో చిన్న సంఘటన జరిగితే ముందుగా చూసేది సీసీ కెమెరా ఫుటేజ్. అవే సరిగా లేకపోతే నేరాలను కట్టడి ఎలా చేస్తారు.. దొంగలను ఎలా పట్టుకుంటారు అని ప్రజలు అంటున్నారు. కడప నగరం ఎర్రముక్క పల్లి – భాకరపేట వెళ్లే రహదారి లో చౌడమ్మ ఆలయం వద్ద పదిహేను రోజుల క్రితం యువకులు గొడవ పడ్డారు. కానీ అక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఇప్పుడు కూడా అలానే ఉన్నాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కాగా.. జిల్లా ఎస్పీ మాత్రం విజువల్ పోలీసింగ్ ఉండాలి.. సీసీ నిఘా కెమెరాలు పటిష్టం చేయాలి అని పదే పదే పోలీస్ అధికారులకు సమీక్ష సమావేశంలో చెబుతుంటారు. ఇప్పటికైనా సీసీ కెమెరాల నిఘాను పక్కాగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నోటి పరిశుభ్రత ఆరోగ్యానికి శ్రేయస్కరం



నోటి పరిశుభ్రత దినోత్సవంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : నోటి పరిశుభ్రత ఆరోగ్యానికి శ్రేయస్కరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రపంచ నోటి పరిశుభ్రత దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నోరు పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటే మానసిక శ్రేయస్సు బాగుంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజు రెండు సార్లు దంతాలను శుభ్రపరుచుకోవాలన్నారు. తాజా కూరగాయలు, పండ్లు ఆహారంగా తీసుకోవడంతో మంచి ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డీపీఎంయూ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ పాల్గొన్నారు.

దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ తమ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ ప్రశాంత్ వర్దన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. గురువారం కడప నగరం నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఏరియాలోని ఉర్దూ హైస్కూలులో ప్రపంచ దంత పరిశుభ్రత దినోత్సవ సందర్భంగా అవగాహన కల్పించారు. ప్రతి సంవత్సరం మార్చి 20వ తేదీన నోటి పరిశుభ్రత, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సంవత్సరం థీమ్ ఆరోగ్యకరమైన నోరు, సంతోషకరమైన మనసు ఆర్ మెదడు అనే థీమ్'తో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నోటి అపరిశుభ్రత వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం ఒకసారి, రాత్రి నిద్రపోయే ముందు ఒకసారి రోజుకు రెండుసార్లు దంతధావనం 3–4 నిమిషాలు మాత్రమే తప్పకుండా చేయాలన్నారు. అనంతరం డాక్టర్. నవీన్ దంతాలను ఏవిధంగా శుభ్రపరచుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మొహమ్మద్ సమీర్, డాక్టర్ జుమ్మా, ఆశా షర్మిల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



విద్యుత్ ఎస్‌ఈ రమణకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కడప ఎస్‌ఈ కార్యాలయం వద్ద విద్యుత్ మీటర్ రీడర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థనే నమ్ముకొని 10 ,15 సంవత్సరాలుగా మీటర్ రీడర్స్ పనిచేస్తున్నారని, వారికి న్యాయం చేయాలన్నారు. నూతన సబ్ స్టేషన్లలో, ఖాళీలు ఉన్న సబ్ స్టేషన్లలో మీటర్ రీడర్స్‌ను ఐటిఐ అర్హత ఉన్న వారిని షిఫ్ట్ ఆపరేటర్ గాను, అలాగే వాచ్ అండ్ వార్డ్ గా నియమించాలన్నారు. నూతనంగా ఏర్పడిన సర్కిల్ ఆఫీసుల్లో అర్హతను బట్టి కంప్యూటర్ ఆపరేటర్స్ గాను, అటెండర్స్ గాను, వాచ్‌మెన్ గాను నియమించేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం ఎస్‌ఈ రమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, నగర అధ్యక్షులు పి. సుబ్బరాయుడు, కాంట్రాక్టు వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ బాబు, మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గపార్ బాష, ఆర్.కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు వెంకటరమణ, లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, జోసఫ్ ఓబులేసు, కోశాధికారి సి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బద్వేలు డిపో నుంచి వివిధ ప్రాంతాలకు బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని, వాటిని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ఈనెల 28వ తేదీన బెంగుళూరు నుంచి మూడు సర్వీసులను నడుపుతున్నామన్నారు. అలాగే ఈనెల 28 నుంచి రాత్రి 9 గంటలకు బద్వేలు నుంచి వయా పోరుమామిళ్ల మీదుగా హైదరాబాదు మియాపూర్‌కు ఒక సర్వీసు నడుస్తుందన్నారు. ఇప్పటికే ఆయా సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. ఫోన్ పే ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆయన వివరించారు.

ఉర్దూ ఉన్నత విద్యా సంస్థలను పటిష్ట పరచాలి



మాట్లాడుతున్న రూట రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ ఉన్నత విద్యను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని ఇది రాష్ట్రంలోని మైనారిటీ ఉర్దూ విద్యార్థులకు అన్యాయం చేయడమే అని ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట, ఏపి) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, ముస్తాఖ్ హుసేన్‌లు అన్నారు. కడపలోని రూట కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో వైవీయూలో ఉర్దూ విభాగం తాత్కాలికంగా ఏర్పాటు చేశారని, అయితే ఉర్దూ డిపార్టుమెంట్‌ను రెగ్యులర్ చేయడం గానీ, అధ్యాపకుల పోస్టులు మంజూరు చేయడం కానీ జరగలేదన్నారు. అక్కడ చదువుతున్న పీజీ విద్యార్థులకు పరిశోధన కోసం పీహెచ్‌డీ అవకాశం లేకుండానే కాలం గడుపుతున్నారని అన్నారు. పీజీ పూర్తి చేసిన విద్యార్థులు కర్నూలు , హైదరాబాదు పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. కర్నూలులో ఏర్పాటు చేసిన ఉర్దూ విశ్వవిద్యాలయంలో కేవలం అకడమిక్ కన్సల్‌టెంట్, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీలతో ఉన్నత కోర్సులన్నీ నిర్వహిస్తున్నారని అన్నారు. అక్కడ మంజూరైన పోస్టులు భర్తీకి నోచుకోని అధ్యాపక పోస్టులను ఉర్దూ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గం మంగళగిరి సమీపాన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభించి మూడు సంవత్సరాలైన రెగ్యులర్ చేయలేదని, తాత్కాలికంగా కేవలం గెస్ట్ ఫ్యాకల్టీలతో నిర్వహిస్తున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలో దాదాపు 17 సంవత్సరాల నుంచి 10 ఉర్దూ జూనియర్ కళాశాలలలో ఒక్క లెక్చరర్ పోస్ట్ కూడా మంజూరు చేయకుండా గెస్ట్ ఫ్యాకల్టీ, కాంట్రాక్టు లెక్చరర్ల ద్వారా నిర్వహిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కటి కూడా ప్రభుత్వ యునాని మెడికల్ కళాశాల లేకపోవడం శోచనీయమని అన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి



పాడె మోస్తున్న ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, విజయ్ తదితరులు

కమలాపురం : అనాథ మహిళ మృతదేహానికి అంత్య క్రియలు నిర్వహించి కమలాపురం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. స్థానిక పైడిమాను కాలనీకి చెందిన అనాథ మహిళ మల్లీశ్వరీ గురువారం మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్‌ఐ అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు సహకారంతో మృతురాలి సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఇలా అనాథ మహిళకు అంత్యక్రియలు నిర్వహించడం పుణ్యకార్యంగా భావిస్తున్నానన్నారు. ప్రజలు ఇలాంటి కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి అభి ట్రస్ట్ చైర్మన్, కమిటీ సభ్యులు సహకరించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాము ముదిరాజ్, జేసీబీ సుధాకర్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం అల్మాస్‌పేటలో ఉన్న పీ.ఎం.కె.కె కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శిక్షణా కేంద్రంలో నిరుద్యోగ ఎస్‌ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తచేసిన యువతీ, యువకులకు ఏఐ డేవోప్స్ ఇంజనీర్, ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కడప సెంటర్ మేనేజర్ ఎస్ కె అంజుమ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 92810 42749 సంప్రదించాలన్నారు.

అతివేగం ప్రమాదకరం

కడప ఎడ్యుకేషన్ : అతివేగం ప్రమాదకరం అని శాంతినికేతన్ హై స్కూల్ వ్యవస్థాపకులు ఇలియాస్ రెడ్డి అన్నారు. గురువారం కడప శాంతినికేతన్ స్కూల్లో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి, యువకులు తమ ద్విచక్ర వాహనాలు అతివేగంతో నడిపి ప్రమాదాలకు గురి కాకూడదని అన్నారు. ట్రాఫిక్ సీఐ జావేద్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో పాటించాల్సిన నియమాలు, జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఆర్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల్ అబ్దుల్ కరీముల్లా, హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

ఆర్‌జేడీకి వినతి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధన ఉల్లంఘించి 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, అఖిల భారత విద్యార్థి బ్లాక్ ప్రధా న కార్యదర్శి జయవర్దన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిల భారత విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు ఈ విషయమై గురువారం పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలు కరపత్రాలు, ఫ్లెక్సీ లు, పెద్ద పెద్ద హోర్డింగ్‌లతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు చేస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ యంత్రాంగం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు.

ఘన నివాళి

కడప రూరల్ : మాజీ సైనికులు లక్ష్మీనారాయణ అనారోగ్యంతో హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జడ్ ఫిలిప్స్ గురువారం స్థానిక కాగితాలపెంటలోని ఆయన నివాసం వద్దకు వెళ్లి లక్ష్మీనారాయణ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రాజశేఖర్, గౌరవాధ్యక్షులు ఓబులేసు, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ప్రొద్దుటూరు డిఫెన్స్ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ మృతికి నివాళులు అర్పించారు. ఆయన సైనికునిగా దేశానికి, మాజీ సైనికుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు సీ నారాయణరెడ్డి, అధ్యక్షులు బాలవీరారెడ్డి, సెక్రటరీ పీ శంకర్‌రెడ్డి మాజీ సైనికులు పాల్గొన్నారు.

వర్గీకరణపై బుడగజంగాల హర్షం

కడప సెవెన్‌రోడ్స్ : షెడ్యూల్ కులాలను వర్గీకరించి తమను ఏ–కేటగిరీలో చేర్చడంపై బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు యలమర్తి మధు, పస్తం అంజి, మోతె పెద్ద జమ్మయ్య, జంపు చంద్రశేఖర్‌లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కడప నగరం బుడగజంగం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో తమను ఏ–కేటగిరి కింద గుర్తించిన జేసీ శర్మ కమిషన్ నివేదికలు కేంద్రానికి పంపుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

జాతర ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కమలాపురం : మండలంలోని ఎర్రగుడిపాడు గ్రామంలో ఈనెల 22 నుంచి రెండు రోజుల పాటు జరిగే గంగమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎర్రగుడిపాడు గ్రామ మేటీలతో పాటు గ్రామ కమిటీ మెంబర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 22, 23 తేదీల్లో ఎర్రగుడిపాడు గ్రామంలో జరిగే గంగమ్మ జాతరను గ్రామ ప్రజలందరూ కలసి మెలసి నిర్వహించుకోవాలన్నారు. గ్రామంలో గొడవలు జరిగితే బాధ్యత మేటీలు, కమిటీ సభ్యులదేనని వారు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులో మరమ్మతులు



బస్టాండులో మరమ్మతులు చేస్తున్న కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులో శ్లాబ్ పెచ్చులూడుతుండడంతో మరమ్మతులు చేపడుతున్నారు. రూ. లక్ష నిధులు మంజూరు కావడంతో బస్టాండులో పెచ్చులూడిన ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపడుతున్నట్లు అధికారులు తెలియజేశారు. అలాగే పైకప్పు నుంచి నీటి లీకేజీ ప్రాంతాలను గుర్తించి వాటిని కూడా ప్లాస్టింగ్ చేస్తున్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలో ఉన్న కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పూర్తి స్థాయిలో పాఠశాలలు నిర్వహిస్తున్నాయని, ఆ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్షుడు అఖిరానందన్ పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అఖిరానందన్ మాట్లాడుతూ రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్నం వరకు పాఠశాలలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయినా కొన్ని విద్యాసంస్థలు ఆ నిబంధనలు ఖాతరు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర ఉపాధ్యక్షులు రాజేష్, సుమంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని కడప ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సీఐ జావీద్ సూచించారు. కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రయాణికులను అధికంగా ఎక్కించుకోకూడదని సూచించారు. అలాగే ఆటో నడిపే సమయంలో ఖచ్చితంగా యూనిఫామ్ ధరించాలని, ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని సూచించారు. యూటర్న్ తీసుకునే సమయంలో చుట్టూ గమనించాలన్నారు. అలాగే ఆటో ప్రయాణీకుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాయలసీమ అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాయలసీమ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి పేర్కొన్నారు.

గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి తాగునీరు, సాగునీరు, విద్య, ఆరోగ్య రంగాలు, ఉపాధి, వ్యవసాయం, పండ్ల తోటల సాగు వంటి కీలక రంగాలకు తక్షణ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాయలసీమలోని కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కియా, ఇసుజు వంటి ప్రధాన కంపెనీలను ఆకర్షించి రాయలసీమను ఆటోమొబైల్ హబ్‌గా మార్చాలని సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 'మిషన్ రాయలసీమ'ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇలాగే వదిలేస్తే ఎలా..?



కోటిరెడ్డి సర్కిల్ సమీపంలో రోడ్డుపైనున్న బండరాళ్లు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని జిల్లా పరిషత్ నుంచి కోటి రెడ్డి సర్కిల్ వైపు వెళ్లే రహదారిలో ఉన్న మురికి కాల్వకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల నగర పాలక సంస్థ అధికారులు చెత్త చెదారంతో నిండి ఉన్న కాల్వను జేసీబీతో పైన ఉన్న బండలను తొలగించి అలాగే వదిలి వేయడంతో ఆ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మురికి కాల్వలపై ఉన్న బండలను రోడ్డుపైనే వేయడంతో రాత్రి సమయాల్లో అవి కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆ ఎస్‌ఐ రూటే.. సపరేటు

- నిత్యం మామూళ్లతో జోగుతున్న ఎస్‌ఐ
- పట్టించుకోని ఉన్నతాధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల నియోజకవర్గంలోని ఓ మండల ఎస్‌ఐ రూటే సపరేటు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నాడు. ఆ ఎస్‌ఐ ప్రవర్తనపట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారు. మండలంలో యథేచ్ఛగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయి. మండల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి హస్తమున్నట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయి. మండలంలో పేకాట, మట్కా, ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నాయి. కానీ మండలానికి సంబంధించిన ఎస్‌ఐ వాటిని అరికట్టాల్సింది పోయి.. వారితో చేతులు కలిపి రోజు వారీగా మామూలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మండలంలోని ఓ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు స్వయంగా తన ఇంటిలోనే నిత్యం జూదం జరిపిస్తున్నాడు. అలాగే డ్యాం పక్కన యథేచ్ఛగా మంగత్తై జూదం టీడీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయి. దీనికి మండల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి అండదండలు పూర్తిగా ఉన్నాయని పులివెందులలోని జూదరులు చెప్పుకుంటున్నారు. అక్కడికి వెళితే పోలీస్ రైడింగ్, ఇతర సమస్యలు ఉండవని బహిరంగంగా చెప్పుకుంటూ అక్కడ జూదానికి వెళ్తున్నారు. దీని వెనుక పులివెందులలోని మారుతీ హాలు సమీపంలోని ఇద్దరు అన్నదమ్ముల ఆధ్వర్యంలో ఈ జూదం జరుగుతున్నట్లు ప్రజలు, జూదరులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. అలాగే మండలంలోని ప్రతి గ్రామంలో బెల్టు షాపులు వెలిశాయి. వీటిపై చర్యలు చేపట్టాల్సిన ఎస్‌ఐ కానీ, ఎక్సైజ్ శాఖ అధికారులు కానీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మినరల్ వాటర్ ప్లాంట్ల కంటే బెల్టు షాపులు అధికంగా ఉన్నాయి.

అలాగే చిత్రావతి డ్యాం నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. పార్నపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రతిరోజు చిత్రావతి డ్యాం నుంచి ఇసుకను టిప్పర్ల ద్వారా కర్ణాటకలోని బెంగళూరుకు తరలిస్తున్నాడు. గత ప్రభుత్వంలో ఇసుక రవాణా అడ్డుకునేందుకు పార్నపల్లె – అనంతపురం బార్డర్ మధ్యలో పోలీసుల చెక్ పోస్టు ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ చెక్ పోస్టును పోలీసులు ఎత్తివేశారు. మండలంలో జరుగుతున్న ప్రతి అసాంఘిక కార్యకలాపానికి ఎస్‌ఐ తీసుకునే ప్రతి లంచంలోనూ తన పరిధిలోని సీఐ, డీఎస్పీలకు వాటాలుగా సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. ఈ అసాంఘిక కార్యకలాపాలపట్ల ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా అని ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు. కేవలం తనకు ఆదాయం వచ్చే ఫిర్యాదులపట్ల అతను ఉత్సాహం చూపిస్తాడని పోలీస్‌స్టేషన్‌లోని ఉద్యోగులే చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజలకు న్యాయం జరిగేలా అధికారిగా వ్యవహరించాలని మండలంలోని ప్రజలు కోరుకుంటున్నారు.